
సాక్షి ఒడిశా

శనివారం । 27 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,08,520, బంగారం 100 మిల్లీ గ్రాములు, వెండి 32 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



నెరవేరనున్న మెట్రో కల

- 10లో▸



దేశ నిర్మాణంలో శ్రామికులదే ప్రధాన పాత్ర

- 10లో▸

న్యూస్‌రీల్

31వ రోజుకు రిలే దీక్ష

- అధికారుల స్పందన కరువు



గజపతి కలెక్టరేట్ ఎదుట రిలే దీక్ష చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు నెలల క్రితం అనుమానాస్పదంగా మృతి చెందిన సౌదామిని రైతోకు న్యాయం చేయాలని కోరుతూ, అమె తల్లి సుజ్ఞాణి గోమాంగ్ గజపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారానికి 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమెకు మద్దతిస్తున్న సీపీఐ(ఎం) పట్టణ అధ్యక్షుడు దూపాన వెంకట్రావు శిబిరం వద్ద మాట్లాడారు. ఇన్ని రోజులుగా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అప్పటివరకు దీక్ష కొనసాగుతుందని తెలియజేశారు.

పదోన్నతులు కల్పించండి



ఏడీఎంకు వినతిపత్రం అందజేస్తున్న గ్రేడెడ్ ఉపాధ్యాయులు

రాయగడ: ఉన్నత పాఠశాలల్లో సహాయ ఉపాధ్యాయులుగా పనిచేసేవారికి పదోన్నతులు కల్పించాలని గ్రేడెడ్ ఉపాధ్యాయుల సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు సీఎం నవీన్ పట్నాయక్ పేరుతో ఒక వినతిపత్రాన్ని జిల్లా అదనపు మేజిస్ట్రేట్‌కు శుక్రవారం సమర్పించారు. ఎంతోకాలంగా తమకు పదోన్నతులు కల్పించాలని కోరుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందించినవారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు అజిత్ కుమార్ చౌదరి, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రథ్ తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ ప్రోత్సాహకాలు నిలిపివేత

భువనేశ్వర్: కోవిడ్ సంబంధిత కార్యకలాపాల్లో నిమగ్నమైన ఆరోగ్య కార్యకర్తలకు ఇచ్చే ప్రోత్సాహకాలను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కోవిడ్–19 ప్రస్తుతం ప్రపంచ ఆరోగ్య విపత్కర పరిస్థితి కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) శుక్రవారం సోషల్ మీడియాలో సందేశం జారీ చేసింది. మరోవైపు రాష్ట్రంలో రోజువారీ కోవిడ్ సంక్రమణ పాజిటివ్ కేసులు తగ్గినందున ఈ మేరకు నిర్ణయించినట్లు రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని, కోవిడ్–19 సంబంధిత కార్యకలాపాల కోసం వివిధ కేటగిరీల మానవ వనరులకు ప్రోత్సాహకాలను నిలిపివేయాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. కోవిడ్–19 ఇకపై ప్రపంచ అత్యవసర పరిస్థితి కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ మహమ్మారిని గ్లోబల్ ఎమర్జెన్సీగా ప్రకటించిన మూడు సంవత్సరాల తర్వాత ఈ ప్రకటన వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఇన్ఫెక్షన్ రేటు స్థిరంగా మరియు నిరంతరం తగ్గుతున్న నేపథ్యంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా ప్రకటన చేసింది.

సాంకేతికతతో ముందడుగు



పలకను సన్మానిస్తున్న అధికారులు

రయగడ: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దుబాయిలోని మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయగలుగుతున్నారని జిల్లా స్వయం సహాయక బృంద కార్యదర్శి కుమారి పలక అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొంతమంది స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలను దుబాయి పర్యటనకు పంపించిన విషయం తెలిసిందే. దుబాయి పర్యటన ముగించుకొని రాయగడకు వచ్చిన పలకను స్థానిక మిషన్ శక్తి హాల్‌లో జిల్లా యంత్రాంగం శుక్రవారం సన్మానించింది. ఈ సందర్భంగా పలక దుబాయి పర్యటన అనుభవాలను వివరించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దుబాయి వంటి ప్రాంతాలకు పర్యటన కోసం మహిళలను పంపించడం అదృష్టమన్నారు. త్వరలో మరి కొంతమంది స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలను సింగపూర్‌కు పంపించే యోచనలో ప్రభుత్వం ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ్ ప్రధాన్, మిషన్ శక్తి జిల్లా కో–ఆర్డినేటర్ నిరంజన్ మల్లిక్, జిల్లా సాంఘిక, సంక్షేమ శాఖ అధికారి యజ్ఞసేని బెహర తదితరులు పాల్గొన్నారు.

చార్జ్‌షీట్ దాఖలు

- మాజీ మంత్రి నవ కిషోర్ దాస్ హత్యలో కీలక పరిణామం
- 540 పేజీలతో చార్జ్‌షీట్
- పాత వైరం కారణంగా నిందితుడు హత్య చేసినట్లు వెల్లడి



బుల్లెట్ గాయాలైన మంత్రిని కారులో తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

భువనేశ్వర్: మాజీ మంత్రి నవ కిషోర్ దాస్ హత్యలో కీలక పరిణామం శుక్రవారం చోటుచేసుకుంది. దాదాపు నాలుగు నెలల తర్వాత ఒడిశా క్రైమ్ బ్రాంచ్ 540 పేజీలకు పైగా చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ విషాద ఘటనలో ప్రధాన నిందితుడు గోపాల్ కృష్ణ దాస్ (53) వ్యతిరేకంగా ఆయుధాల చట్టం ప్రకారం 307, 302, 27 (1) సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశారు. పాత వైరం కారణంగా నిందితుడు దారుణ హత్యకు పాల్పడినట్లు విచారణలో ధ్రువీకరించినట్లు చార్జ్‌షీటులో వెల్లడించారు.

జనవరి 29న హత్య

ఈ ఏడాది జనవరి 29న మంత్రి అధికారిక కార్యక్రమం పర్యటనలో నడి రోడ్డమీద జన సందోహం మధ్య నిందితుడు తుపాకీ గురిపెట్టి పేల్చడంతో మంత్రి అక్కడిక్కడే కుప్పకూలిపోయిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం, శాస్త్రీయ బృందం పరిశీలన నివేదికల ఆధారంగా నిందిత ఏఎస్‌ఐ గోపాల కృష్ణ దాస్‌ని విధుల నుంచి బహిష్కరించారు. మంత్రితో బ్రజ్‌రాజ్‌నగర్ థానా ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ (ఐఐసీ) పి.కె.స్వంయి మరో సిబ్బంది జీవన్ కుమార్ నాయక్‌ని హత్య చేసేందుకు నిందితుడు విఫలయత్నం చేసినట్లు ఝార్సుగుడ ఎస్‌డీజేఎం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు క్రైమ్ బ్రాంచ్ మీడియాకు తెలియజేసింది.

ముందస్తు ప్రణాళికతోనే...

నిందితుడు ఏఎస్‌ఐ గోపాల్‌కృష్ణ దాస్ తెలివిగా ముందస్తు ప్రణాళికతో ఈ నేరానికి పాల్పడ్డాడని క్రైం బ్రాంచ్ తెలిపింది. అతని మానసిక పరిస్థితి స్థిరంగా, సాధారణమైనదిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఎటువంటి మానసిక అనారోగ్య లక్షణాలు దర్యాప్తులో బయటపడనట్లు వివరించింది. సంచలనాత్మక హత్య సంఘటనకు సంబంధించిన అన్ని రకాల సాక్ష్యాలను పరిశీలించి విశ్లేషించింది. ఈ నేపథ్యంలో మౌఖిక, దస్తావేజులు, మెడికో–లీగల్, సైబర్ ఫోరెన్సిక్ మరియు బాలిస్టిక్ నివేదికలను క్రైం శాఖ లోతుగా సమీక్షించింది. ఈ సమీక్షలో నిం



నిందితుడు ఏఎస్‌ఐ గోపాల్ కృష్ణదాస్ (ఫైల్)

దితుడు గోపాల్ కృష్ణ దాస్ దివంగత మంత్రి నవ కిషోర్ దాస్ మరియు అతని అనుచరులతో తనకు ప్రాణాపాయం ఉన్నట్లు భావించి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మంత్రి అనుచర వర్గాలు తరచు ఆయనకు ప్రాణాపాయ హెచ్చరికలు జారీ చేస్తుండడంతో మంత్రిపై వ్యక్తిగత ద్వేషం బలపడి మానసిక వేదనతో మంత్రిని నిలువునా హత్య చేసి తొలగించాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో స్పష్టమైంది. అభద్రతా భావంతోనే మంత్రి హత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. దీనికోసం పక్కాగా ప్రణాళిక సిద్ధం చేసుకుని బెడిసి కొట్టని వ్యూహంతో తుపాకీ గురి పెట్టి ఘటనా స్థలంలో మంత్రిని కుప్పకూల్చినట్లు క్రైం శాఖ తెలిపింది. ఛార్జ్‌షీట్ దాఖలు చేసినప్పటికీ, కొన్ని నివేదికలు, వివరణలను పొందడం కోసం దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

మానసిక రోగి: కుటుంబ సభ్యులు

నిందితుడి కుటుంబ సభ్యులు గోపాల్ కృష్ణదాస్



మంత్రి నవ కిషోర్ దాస్ (ఫైల్)

చాలాకాలంగా మానసిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కొంతకాలంగా బైపోలార్ డిజార్డర్‌తో బాధపడుతున్నాడని అంటున్నారు. అయితే అనుబంధ చికిత్స కొనసాగుతుందని దర్యాప్తు వర్గాలు విచారణలో పేర్కొన్నాయి. మానసిక ఇబ్బందుల విషయం ధ్రువీకరించేందుకు వైద్య విద్య మరియు శిక్షణ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బోర్డును ఏర్పాటు చేశారు. ఈ బోర్డు అనుబంధ పరీక్షలను నిర్వహించి, నిందితుడిలో మానసిక అనారోగ్యానికి సంబంధించిన లక్షణాలు లేవని స్పష్టం చేసింది. స్థానికులు, సహోద్యోగుల వాంగ్మూలం వైద్య బోర్డు అభిప్రాయానికి చేరువగా ఉన్నట్లు క్రైమ్ శాఖ తెలిపింది. నిందితుడు సాదాసీదాగా కలిసిమెలిసి తిరుగాడే వ్యక్తిగా తోటి వ్యక్తుల వాంగ్మూలం దర్యాప్తు బృందం నమోదు చేసింది. ఇలా పరిసరాల పరిశీలన, అనుబంధ విశ్లేషణలో నిందితుని మానసిక పరిస్థితి చాలా సాధారణంగా ఉందని, ఎటువంటి అసాధారణత లేదని నిర్ధారించారు. విచారణకు నిందితుడు సంతృప్తికరంగా సహకరించారని, అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానమిచ్చారని క్రైమ్ బ్రాంచ్ అధికారులు తెలిపారు.

అధికారిక రివాల్వరే హత్యాస్త్రం

విధి నిర్వహణలో ఉండగా పోలీసు ఏఎస్‌ఐ గోపాల్ కృష్ణ దాస్ హత్యకు పాల్పడ్డాడు. ఈ సందర్భంగా తన దగ్గర ఉన్న అధికారిక రివాల్వర్‌తో సిటింగు ఆరోగ్య – కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నవ కిషోర్ దాస్‌ను జన సందోహం మధ్య కాల్చి నడి రోడ్డు మీద కుప్పకూల్చేశాడు. ఈ హత్య వెనుక కుట్ర ఉందని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు నిలువెత్తున ఆరోపించాయి. విచారణ చేపట్టి చార్జిషీట్ దాఖలు చేసిన క్రైమ్ బ్రాంచ్ విచారణలో కుట్ర కోణం జాడ లేనట్లు వెల్లడించింది.



ఆస్పత్రిలో స్ట్రెచర్‌పై మంత్రి నవ కిషోర్‌దాస్ (ఫైల్)

10 బృందాలతో దర్యాప్తు

సిటింగ్ మంత్రి హత్య జరిగిన రోజు నుంచే క్రైమ్ బ్రాంచ్, బ్రజరాజ్‌నగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. లోతైన దర్యాప్తు కోసం క్రైమ్ బ్రాంచ్ 10 బృందాలను ఏర్పాటు చేసింది. హత్య వ్యూహం పూర్వాపరాలను ఆరా తీసేందుకు రాష్ట్రంలో ఝార్సుగుడ, భువనేశ్వర్, బరంపురం మరియు పలు ఇతర రాష్ట్రేతర ప్రాంతాలు సందర్శించి దర్యాప్తు బృందాలు పూర్వాపరాలు ఆరా తీశాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు వర్గాలు 89 మంది సాక్షులను ప్రశ్నించారు. తుపాకీలు, లైవ్ కాట్రిడ్జ్‌లు, ఖాళీ కాట్రిడ్జ్‌లు ఇతరేతర పలు రుజువుపూరిత ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.

ఇదీ జరిగింది

ఝార్సుగూడ జిల్లాలో మంత్రి కార్యక్రమం పురస్కరించుకుని నిందిత ఏఎస్‌ఐ గోపాల్ కృష్ణదాస్‌ని ట్రాఫిక్ క్లియరెన్స్ డ్యూటీ కోసం నియమించారు. ఈ అవకాశాన్ని వ్యూహాత్మకంగా మలచుకుని తన దగ్గర ఉన్న 9 ఎంఎం సర్వీస్ పిస్టల్‌ని ఉపయోగించి అతి సమీపం నుంచి మంత్రిపై కాల్పులు జరిపాడు. రక్తపు మడుగులో కూరుకుపోయిన మంత్రిని హెలికాప్టర్‌లో హుటాహుటిన భువనేశ్వర్‌కు తరలించారు. అయితే అంతర్గత రక్తస్రావం కారణంగా చికిత్స పొందుతూ మంత్రి తుదిశ్వాస విడిచాడు. నిందితుడు 2013లో ఝార్సుగుడ జిల్లాలో పోలీసు ఉద్యోగం పొందాడు. తన ఉద్యోగ జీవితంలో నిందిత గోపాల కృష్ణ దాస్ శ్రేష్ఠమైన పనితీరుకు తొమ్మిది రివార్డులు, 18 ప్రశంసా పత్రాలు పొందడం విశేషం. అతని కుటుంబం బరంపురం శివారులోని జలేశ్వరఖండిలో ఉంటుంది. విచారణలో భాగంగా నిందితుడికి మానసిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్రేతర (బెంగుళూరు) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్‌కు తీసుకెళ్లాలన్న అభ్యర్థనను స్థానిక కోర్టు తిరస్కరించింది.

సెలూన్ షాప్‌లో చోరీ

రాయగడ: స్థానిక డైలీ మార్కెట్‌లో ఉన్న సెలూన్ షాప్‌లో గురువారం రాత్రి చోరీ జరిగింది. దుకాణంలో ఉన్న రూ.20 వేల నగదు, 5 ట్రిమ్మర్లు, మరికొన్ని వస్తువులు దుండగులు దోచుకెళ్లారని బాధితుడు చిట్టిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే గురువారం రాత్రి దుకాణం మూసివేసిన చిట్టిబాబు, శుక్రవారం యథావిధిగా దుకాణాన్ని తెరిచేందుకు వెళ్లగా షట్టరు తెరిచి ఉండడం గమనించి దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకున్నారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌కు వెళ్లగా పోలీసులు ముందుగా ఫిర్యాదు నమోదు చేయలేదు. అనంతరం మీడియా ప్రతినిధులకు విషయం తెలియగా, వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఫిర్యాదు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. తరచూ పట్టణంలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి సంఘటనలు చోటుచేసుకుంటుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.



బాధితుడు చిట్టిబాబు

భారీగా గంజాయి స్వాధీనం



బరంపురం: పోలీసులు సీజ్ చేసిన 569 కిలోల గంజాయి బస్తాలు



బరంపురం: సీజ్ చేసిన గంజాయి బస్తాలు, అరెస్టు చేసిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు



మల్కన్‌గిరి: పట్టుబడిన నిందితులు



మల్కన్‌గిరి: నిందితులు నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లు, కార్డులు

బరంపురం: కొందమాల్–గంజాం జిల్లాల సరిహద్దు తప్పపాణి ఘాట్ రోడ్ నుంచి బరంపురం నగరం మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వాహనంపై ఉభయ జిల్లాల ఎక్సైజ్ అధికారులు దాడిచేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ విభాగం అధికారి రామచంద్ర మహంతి తెలిపిన వివరాల మేరకు.. కొందమాల్–గంజాం జిల్లాల సరిహద్దు నుంచి బరంపురం మీదుగా బీహార్‌కు అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ అధికారులు ఘాట్ రోడ్‌లో మాటువేసి అటువైపు వస్తున్న వ్యాన్‌ను ఆపి తనిఖీలు చేయగా, బస్తాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 569 కిలోల గంజాయి బయటపడింది. దీంతో వ్యాన్‌లోని ఐదుగురు వ్యక్తులు పరారయ్యారు. అలాగే బరంపురం నగరం దగ్గర గోశంతర పోలీసులు 16వ నంబర్ జాతీయ రహదారిలో వస్తున్న ఆటోపై దాడిచేసి, 49 కిలోల గంజాయి బస్తాలు సీజ్ చేసి, మదనపూర్ గ్రామానికి చెందిన దుర్యోధనను అరెస్టు చేశారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితిలో ఐఐసీ సూర్యప్రకాష్ నాయిక్ తన సిబ్బందితో గురువారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కమలాపోధర్ గ్రామం వద్ద ఘాట్ రోడ్డులో అతివేగంగా వెళ్తున్న రెండు కార్లను ఆపి తనిఖీ చేశారు. ఈ కార్లలో నాలుగు బస్తాల్లో గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిందితులను విచారించగా తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా లాల్‌బాహదూర్ ప్రాంత పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ ఆర్.శ్రీను నాయిక్‌గా ఒకరిని గుర్తించారు. మరో ఆరుగురు నిందితులు రంగారెడ్డి జిల్లాకు చెందిన కె.విజయ్, నాయిక్, మహారాష్ట్రకు చెందిన బాలు యాదవ్, మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితికు చెందిన కె.లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఆర్.కార్తిక్, ఆర్.రాజీవ్, ఎస్.వేణుగోపాల్‌లుగా తెలిసింది. నిందితుల నుంచి మూడు ఐఫోన్లు, మూడు స్మార్ట్ ఫోన్లు, ఐడీ కార్డులు, ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు.

పవిత్ర స్నానానికి భారీ ఏర్పాట్లు

- 70 ప్లాటూన్లతో పోలీసు భద్రత

భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్ర ఉత్సవాలు దగ్గర పడుతున్నాయి. స్వామివారి యాత్ర అడుగడుగున భారీ ఘట్టాలతో భక్త జనాన్ని తన్మయం చేస్తుంది. వార్షిక రథ యాత్రలో స్నానోత్సవం తొలి ఘట్టంగా ప్రాధాన్యత సంతరించుకుంది. స్నాన పూర్ణిమ పురస్కరించుకుని మూల విరాటులకు భారీ జలాభిషేకం నిర్వహిస్తారు. ఈ ఉత్సవం ఈ ఏడాది జూన్ 4న నిర్వహిస్తారు. శ్రీమందిరం ప్రధాన ప్రాకారం ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై మూల విరాటుల స్నానోత్సవం బహిరంగంగా నిర్వహించడం ఆచారం. స్థానికులతో పాటు ఇరుగుపొరుగు ప్రాంతాల నుంచి భక్తులు, యాత్రికులు తండోపతండాలుగా తరలి వస్తారు. బహిరంగంగా జరిగే స్వామివారి అష్టోత్తర శత కలశ జలాభిషేకం కనులారా తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ఈ నేపథ్యంలో రద్దీ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం నడుం బిగించింది. ఈ మేరకు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అధ్యక్షతన ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్నానయాత్ర భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులు, యాత్రికులకు సులభ దర్శనం మరియు భద్రత కోసం 70 ప్లాటూన్ పోలీసు బలగాలను మోహరించాలని నిర్ణయించారు. అలాగే 20 మంది అదనపు ఎస్పీ హోదా అధికారులు, 90 మంది సీనియర్ అధికారులు ప్రత్యక్షంగా శాంతిభద్రతల కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు.



స్నానోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు జరుగుతున్న దృశ్యం

5 భాగాలుగా విభజన

యాత్ర ప్రాంగణాన్ని 5 భాగాలుగా విభజించి భద్రతా వ్యవస్థను వ్యూహాత్మకంగా నిర్వహించేందుకు కార్యాచరణ ఖరారు చేశారు. ఆలయం లోపల, వెలుపల గట్టి భద్రతను ఏర్పాటు చేస్తారు. అలాగే భక్తుల దర్శనానికి మారీచ్ కోట్ వీధి నుంచి బారికేడ్లు ఏర్పాటు చేసి రద్దీ క్రమబద్ధీకరణతో సులభ దర్శనం సౌకర్యం కల్పిస్తారు. బహిరంగంగా మూల విరాటుల స్నానం (దేవస్నాన పూర్ణిమ) పురస్కరించుకుని తండోపతండాలుగా తరలి వచ్చే భక్తులు, యాత్రికులతో ఈ ప్రాంగణం రద్దీగా తయారవుతుంది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్టిలో ఉంచుకుని పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ఎస్పీ తెలిపారు.



శ్రీమందిరం ప్రాంగణంలో సిద్ధమవుతున్న స్నాన మండపం

ఎదురు కాల్పులు

- మావోలు – బీఎస్ఎఫ్ జవాన్ల మధ్య కాల్పులు
- భారీ డంప్ స్వాధీనం
- కొనసాగుతున్న కూంబింగ్

బరంపురం: కొందమాల్–చత్తీష్‌ఘడ్ సరిహద్దు కెసరబడి దట్టమైన అటవీ ప్రాంతంలో ఎస్‌వోజీ జవాన్లపై దాడికి పాల్పడేందుకు వ్యూహాలు పన్నుతున్న మావోలు కూంబింగ్ నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ జవాన్లకు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. సుమారు 3 గంటల పాటు జరిగిన ఎదురుకాల్పుల్లో సీఆర్పీఎఫ్ జవాన్లు పైచేయి సాధించడంతో మావోయిస్టులు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. సీఆర్పీఎఫ్ అధికారి సిహ్నా తెలిపిన వివరాలు మేరకు.. శుక్రవారం ఉదయం కొందమాల్ జిల్లా తుమ్ముడిబంద పోలీసుస్టేషన్ పరిధి పారుమెట్టా దట్టమైన అటవీ ప్రాంతంలో మావోయిస్టులు జవాన్లపై దాడికి వ్యూహం పన్నుతున్నట్లు సమాచారం అందింది. దీంతో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ జవాన్లు కూంబింగ్ చేపట్టారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఎస్‌వోజీ జవాన్లు, స్థానిక పోలీసుల సహకారంతో కూంబింగ్ చేపడుతుండగా కెసరబడి సమీపంలో మావోలు తారసపడగా హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. అనంతరం మావోల నుంచి డంప్ స్వాధీనం చేసుకున్నారు.

డంప్ స్వాధీనం

కొందమాల్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో పోలీసులు భారీ డంప్ స్వాధీనం చేసుకున్నారు. దీనిలో ఎస్ఎల్ఆర్ మ్యాగజిన్, ఒక ఇన్‌సిల్లా రైఫిల్, కంట్రీ మేడెడ్ తుపాకీ. ఎస్ఎల్ఆర్ 16 రౌండ్స్ గల మ్యాగజిన్, 2 ఇన్‌సిల్లా 5.56 ఎంఎం, 5 సోలర్ ప్లాట్లు, రేడియో సెట్, 11 గొడుగులు, 12, 6 ఓల్టేజీల బ్యాటరీలు, 5 వాటర్ జగ్గులు, ఔషధాలు, మావో విప్లవ సాహిత్య పుస్తకాలు, విద్యుత్ వైర్లు, ఒక వాకీటాక్, ఒక వాకీటాక్ చార్జర్, చిన్న ఇన్వేర్టర్, విద్యుత్ సామగ్రి, 4 సింగిల్ షాట్ తుపాకీలు, ప్లాస్టిక్ టార్పాలిన్స్ తదితర వస్తువులు సేకరించారు.



కూంబింగ్ నిర్వహిస్తున్న జవాన్లు



జవాన్లు స్వాధీనం చేసుకున్న మావోల డంప్



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న జవాన్లు

క్లుప్తంగా

ప్రాసెస్ ఫీజు చెల్లింపు ప్రక్రియ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలిసెట్-2023 ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రాసెస్ ఫీజు చెల్లింపు ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఫీజు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:ఏపీపాలిసెట్.ఎన్ఐసీ.ఇన్‌లో ఫీజు చెల్లించాలి. ఈ నెల 29వ తేదీ నుంచి శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సహాయ కేంద్రంలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. నోటిఫికేషన్ మేరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందని, జూన్ 15 నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభమవుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రవేశాల సమన్వయ కర్త జి.దామోదర్ రావు తెలిపారు.

'కథా నిలయం చిరస్థాయిగా ఉంటుంది'


ప్రముఖ రచయిత కె.శివారెడ్డి

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని కథా నిలయం చిరస్థాయిగా నిలబడి ఉంటుందని ప్రముఖ రచయిత కె.శివారెడ్డి అన్నారు. స్థానికంగా ఒక కార్యక్రమానికి పాల్గొనేందుకు వచ్చిన ఆయన శుక్రవారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. కథలు, కవిత్వం రాసేవాళ్లు ప్రస్తుత సమాజంలోని సమస్యలను, దేశభక్తి, సంఘటనలను కథావస్తువులుగా తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కథా రచయితలకు సరైన ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. మహిళలు కూడా ఎంతో మంది సాహిత్య రంగంలో ఎన్నో మంచి రచనలు చేశారని, చేస్తున్నారని అన్నారు. తెలుగు భాష తప్పని సరిగా ఉండాలని, తెలుగులో చదివిన వారు ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారు ఉన్నారని అన్నారు. సమాజ హితమైన సాహిత్యం రావాలని కోరారు.

28న పీఆర్ ఇంజినీర్ల సర్వసభ్య సమావేశం

అరసవల్లి: ఏపీ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజినీర్ల జిల్లా సంఘ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 28వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లుగా ఆ సంఘ అధ్యక్షుడు కేసీహెచ్ మహంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో పీఆర్ ఇంజినీర్లకు చెందిన పలు కీలక అంశాలను చర్చించనున్నామని, జిల్లాలో సభ్యులైన డీఈఈలు, ఎఈలు, టెక్నికల్, అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, తదితర సిబ్బంది అంతా హాజరుకావాలని మహంతి కోరారు.

శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు జాతీయ అక్రిడేషన్ కమిటీ గుర్తింపు

ఎచ్చెర్ల క్యాంపస్: మెరుగైన విద్యా ప్రమాణాలు, మౌలిక వసతుల ఆధారంగా శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు జాతీయ అక్రిడేషన్ కమిటీ గుర్తింపు మంజూరు చేసింది. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ నెలలో కమిటీ భౌతికంగా కాలేజీని సందర్శించిందని, ఆ సందర్శనలో క్లాస్‌వర్క్, అర్హత గల బోధకులు, మౌలిక వసతులు, ల్యాబ్‌లు, విద్యార్థులకు లభిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటివి పరిశీలించిందని, సంతృప్తి చెంది గుర్తింపు మంజూరు చేసిందని తెలిపారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలకు మూడేళ్లు ఈ గుర్తింపు మంజూరు చేశారని పేర్కొన్నారు.

ఇండక్షన్ ట్రైనింగ్‌తో గుణాత్మక విద్య


టీచర్లకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

కాశీబుగ్గ: గుణాత్మక విద్యను విద్యార్థులకు అందించేందుకు ఇండక్షన్ ట్రైనింగ్ ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. కాశీబుగ్గలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలని సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో అభ్యసన ఫలప్రదమవుతుందని అన్నారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పగడాలమ్మ మాట్లాడుతూ విద్యార్థులను నైతిక విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ముగింపు సమావేశంలో కోర్స్ డైరెక్టర్ వై.చిన్నమనాయుడు, మండల విద్యాశాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, కోర్స్ కో ఆర్డినేటర్ ఏస్ సూర్యప్రకాష్, బలివాడ సతీష్ రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు లభినాన వెంకటాచలం, ఆర్‌వి రమణమూర్తి, శ్రీనివాసరావు, పి.షణ్ముఖరావు, కిల్లి ఈశ్వరరావు పట్నాయక్, ముఖలింగం జి.వాణికుమారి పాల్గొన్నారు. ఈ ముగింపు సమావేశంలో చివరగా శిక్షణార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

వర్తక సంఘం కన్వీనర్‌గా విజయ్



పార్వతీపురంటౌన్: ఏపీ బంగారం, వెండినగల వర్తక సంఘం రీజనల్ కన్వీనర్‌గా పార్వతీపురం పట్టణానికి చెందిన ఇందుపూరు విజయ్ ఎన్నికయ్యారు. ఆయనను పార్వతీపురంలోని బంగారం, వెండి నగల వర్తక సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

నెరవేరనున్న మెట్రో కల

- త్వరలో పనులు ప్రారంభం


సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉషాదేవి

భువనేశ్వర్: నగర వాసుల మెట్రో రైలు కల అతి త్వరలో సాకారం కానుంది. రాష్ట్రంలో మెట్రో రైలు ప్రాజెక్టు పనులు ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభమవుతాయని రాష్ట్ర గృహ నిర్మాణం, నగర అభివృద్ధి శాఖ మంత్రి ఉషా దేవి తెలిపారు. గత నాలుగేళ్లలో తన శాఖ సాధించిన విజయాలపై శుక్రవారం ఆమె సమీక్షించారు. భువనేశ్వర్ క్యాపిటల్ రీజినల్ కోసం ముఖ్యమంత్రి మెట్రో రైలు వ్యవస్థను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ కన్సల్టెంట్‌గా ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ వ్యవహరిస్తుంది. ఈ ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ఈ ఏడాది నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.

వచ్చే నెలలో శంకుస్థాపన

జూన్ నెలలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని గృహ నిర్మాణం, నగర అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.మత్తివత్తనన్ మీడియాకు వెల్లడించారు. ప్రతిపాదిత మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే పూర్తయింది. ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) తుది మెరుగులు దిద్దుకుంటుంది. మెట్రో రైలు నడిచే మార్గాలను కూడా ఖరారు చేశారు. తొలి దశలో మెట్రో రైలు భువనేశ్వర్ నుంచి కటక్ మధ్య నడుస్తుంది. తదుపరి దశలో ఈ సేవల్ని జట్నీ మరియు పూరీ ప్రాంతాలకు విస్తరిస్తారని ఆయన పేర్కొన్నారు. ఉత్కళ దివస్ సందర్భంగా ప్రయాణికులు, పర్యాటకులకు ప్రయాణాన్ని సులభతరం చేయడానికి కటక్, భువనేశ్వర్, పూరీ, ఖుర్దాలను కలుపుతూ మెట్రో రైలు ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ ప్రాజెక్టును వివిధ వాటాదారులు అధ్యయనం చేశారు. ఈ వర్గాలు ప్రాజెక్టు నిర్వహణ సాధ్యాసాధ్యాల నివేదికలను రూపొందించాయి. ఇది ప్రధానంగా ఎలివేటెడ్ కారిడార్లపై ఆధారపడి ఉంటుంది మరియు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే నిధులు సమకూరుస్తుంది అని అప్పట్లో ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ పూరి మరియు భువనేశ్వర్ ప్రాంతాల మధ్య 64 కిలోమీటర్ల ప్రయాణానికి సుమారు అరగంట సమయాన్ని తగ్గిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

త్వరలో వందే మెట్రో

ఈ నెల మొదట్లో హౌరా - పూరీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం వేడుకలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఒడిశాలో వందే స్లీపర్ మరియు వందే మెట్రోను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. వందే మెట్రో స్వల్ప దూర నిత్య ప్రయాణానికి వారధిగా నిలుస్తుంది. 100 కిలోమీటర్ల కంటే తక్కువ దూరంలో ఉన్న నగరాల మధ్య ప్రయాణికులకు వేగవంతమైన సేవలు కల్పిస్తుంది.

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షీ బాహిణీపతి

జయపురం: జయపురం నియోజకవర్గంలో గత 9 ఏళ్లలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి చేసిన అభివృద్ధిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షీ బాహిణీపతి పిలుపునిచ్చారు. స్థానిక బొరిగుమ్మ దొర కల్యాణ మండపంలో బొరిగుమ్మ సమితి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. బొరిగుమ్మ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ కుమార్ గంతాయిత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీజేడీ పాలనలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 9 ఏళ్లుగా తారాప్రసాద్ బాహిణీపతి నియోజకవర్గం అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించారని తెలియజేశారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి మరోసారి ఆయనను గెలిపించాలని కోరారు. కార్యకర్తలు పార్టీ విజయం కోసం సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కొరాపుట్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నళినీ రథ్, జిల్లా ఛాత్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రణయ శర్మ, బొరిగుమ్మ జిల్లా పరిషత్ 3వ జోన్ నృసింహనాథ్ శతపతి, చంద్రికా శాంత, సురేష్ రౌత్, కెజ సుధాకర్, బుడు చౌధరి, బిటు పండ, తపన్ రథ్, బి.ప్రసాద్ దొర, లండు బెగరాయ్, చంద్రశేఖర మహంతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు సిక్కోలు యువకులు


మోహన్‌సాయి


అప్పన్న


భానుప్రసాద్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక జాతీయ సబ్ జూనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో తురల్ల మోహన్‌సాయి, కారి అప్పన, ముడిదాన భానుప్రసాద్ ఉన్నారు. వీరంతా శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద డీఎస్‌ఏ శాప్ వాలీబాల్ కోచ్ కె.హరికృష్ణ వద్ద శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 15 నుంచి రాజమండ్రిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ శిక్షణ శిబిరాల్లో మెరుగ్గా రాణించి సెలెక్టర్లను ఆకట్టుకోవడం ద్వారా జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 28 నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా వేదికగా జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన మోహన్‌సాయి, అప్పన్న, భానుప్రసాద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలురు జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి, పీడీ యాళ్ల పోలినాయుడు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, వాలీబాల్ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామచంద్రుడు, ఎన్వీ రమణ తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

వేలి ముద్రల ఇక్కట్లకు చెక్

- రేషన్ పంపిణీ విధానంలో మార్పులు
- వేలి ముద్ర పడకపోతే ఐరిష్ ద్వారా రేషన్ పంపిణీ
- జిల్లాకు 422 ఐరిష్ పరికరాల పంపిణీ


ఎండీయూ వాహనాల సిబ్బందికి ఐరిష్ పరికరాలు అందిస్తున్న నరసన్నపేట తహసీల్దార్ సింహాచలం

నరసన్నపేట: తెల్లరేషన్ కార్డు దారులకు రేషన్ పంపిణీలో ప్రభుత్వం సరికొత్త విధానాలకు తెర తీస్తోంది. ఇంటి వద్దకే తెచ్చి రేషన్ అందిస్తున్న ప్రభుత్వం .. వేలిముద్రలు పడక ఇబ్బంది పడుతున్న వారి ఇక్కట్లకు చెక్‌పెట్టనుంది. వీరికి ఐరిష్ ద్వారా రేషన్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు జూన్ నెల నుంచి కొత్త విధానం అమలు చేయడానికి ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే జిల్లాలోని 422 వాహనాలకు ఐరిష్ పరికరాలను అందజేసింది.

రేషన్ పంపిణీలో అక్కడక్కడా వేలి ముద్రల సమస్య తరచూ ఉత్పన్నమవుతోంది. ముఖ్యంగా వృద్ధులు ఉన్న చోట ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఆధార్ కార్డు అప్‌డేషన్‌కు వెళ్లేటప్పుడు కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. ఫలితంగా వీరికి రేషన్ అందించడానికి వీలు కావడం లేదు. ఇలా జిల్లావ్యాప్తంగా దాదాపు మూడువేల మంది బాధపడుతున్నారు. ఇలాంటి వారికి ఇకపై సమస్యలు ఉండవు. ఐరిష్ ద్వారా రేషన్ సరుకులు ఇవ్వడానికి ప్రభుత్వం సన్నద్ధమైంది.

జూన్ నుంచే..

జిల్లాలో 422 మొబైల్ వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా 6,61,824 కార్డుదారులకు నెలవారీ సరుకులు అందిస్తున్నారు. జూన్ నుంచి ఐరిష్(కంటి గుర్తింపు) విధానం అమలు చేయనున్నారు. దీనిపై విజన్‌టెక్ ప్రతినిధులు ఎండీయూ వాహనాల సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. వేలి ముద్ర సమస్య ఉన్న వారికి ఐరిష్ ద్వారా రేషన్ ఇస్తారు.

ఖేలో ఇండియా బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా సూరిబాబు


ఎస్.సూరిబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఖేలో ఇండియా బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు అంపైర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఏపీబీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంకమ్మ చౌదరి నియామక ఉత్తర్వులు వెలువరించారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో వేదికగా ఈనెల 29 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఆలిండియా ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. సూరిబాబు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీఈఓగా పనిచేస్తున్నారు. ఖేలో ఇండియా పోటీలకు నియామకం కావడంపై జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, చైర్మన్ ఆర్.రాజేంద్రన్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, బి.దామోదర్, జి.ప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం


తీవ్రగాయాలపాలైన లక్ష్మణరావు

టెక్కలి రూరల్: స్థానిక చిన్నబజారు జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గంగాధరపేట గ్రామానికి చెందిన బమ్మిడి లక్ష్మణరావు అనే వ్యక్తికి తన పెదనాన్న కుమారులతో ఆస్తి తగాదాలు ఉన్నాయి. దీనిపై వారు కోర్టుకు కూడా వెళ్లారు. ఈ వివాదంలో భాగంగానే శుక్రవారం చిన్నబజార్ జంక్షన్ సమీపంలోని తన పెద్దనాన్న కుమారుడి ఇంటి ఎదురుగా నిలబడిన లక్ష్మణరావు తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. తీవ్రగాయాలపాలైన ఆయనను స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఘటనపై టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

● రంగుల హంగులు


పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నిర్మితమవుతున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆస్పత్రిలోని రెండు బ్లాక్‌లకు కొత్త రంగులు వేశారు. – కాశీబుగ్గ

దేశ నిర్మాణంలో శ్రామికులదే ప్రధాన పాత్ర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: దేశ నిర్మాణంలో కార్మికులు, శ్రామికులదే ప్రధాన పాత్ర అని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురంలో నిర్మాణ శ్రామిక మిలిత సంఘం నూతన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న శ్రామికులకు ప్రస్తుతం రాజ్యాంగపరమైన హక్కులు, గౌరవం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవాన్ని కాపాడుకునేందుకు, హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్షుడు బాలారాయ్ మాట్లాడుతూ.. నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తున్నా, అవి అనేక మందికి చేరడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవ సాగరియ, ఉపాధ్యక్షుడు పాణీ సాహు, రామ టక్రీ, సాధారణ కార్యదర్శి ప్రేమ మోహన్, సహాయ కార్యదర్శులు సురేంద్ర నాథ్ సాహు, సత్యనారాయణ డాకువ, కోశాధికారి ఆర్.సుదర్శనరావు, సలహాదారు ప్రబీర్ మహంతి, కార్యవర్గ సభ్యులు లక్ష్మణ సాహు, పాతిరాం ఖొర, జొగా హియాల్, సంతోష్ కుమార్ సాహు, పితాంబర ఖొర, ప్రకాశ్ చంద్ర సాహు, ఉదయ నాథ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

సమలాయి దుర్గ జాతర ప్రారంభం


అమ్మవారి పాదాలు తీసుకొచ్చేందుకు వెళ్తున్న పూజారులు


సమలాయి దుర్గా అమ్మవారు

రాయగడ: స్థానిక పాయికొ వీధిలో వెలసిన సమలాయి దుర్గ అమ్మవారి జాతర శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యింది. సాయంత్రం అమ్మవారి పాదాలు తీసుకువచ్చే సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అయిదు రోజులు జరిగే ఈ జాతర బుధవారంతో ముగుస్తుందని నిర్వాహకులు తెలియజేశారు.


ఊరేగింపులో పాల్గొన్న నెక్కంటి

ఆయిల్‌పామ్ రైతులకు 'ఉపాధి' సాయం


మాట్లాడుతున్న ఆర్‌వీవీ ప్రసాదరావు

గార: ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఉపాధి హామీ పథకం కింద అదనంగా ఆర్థిక సాయం అందివ్వనున్నట్టు జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్‌వీవీ ప్రసాదరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాల వీఏఏలకు అవగాహన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఆయిల్ పామ్ రైతులకు నాలుగేళ్లకు ఎకరాకి రూ. 27,800 అందిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది అదనంగా ఉపాధి హామీ పథకం అనుసంధానం చేశామన్నారు. జాబ్ కార్డు కలిగిన రైతుకు ఒక ఎకరాకు మూడేళ్లలో రూ.47,648లు అదనపు ప్రోత్సాహకాన్ని అందజేసినట్టు చెప్పారు. ఈ ఏడాది ఆయిల్‌పామ్ మొక్కలను కంపెనీలు ఉచితంగా ఇవ్వాలని కోరామన్నారు. 2022-23 సంవత్సరంలో గార మండలలో అత్యధిక దిగుబడి సాధించిన కె.రామరాజును ప్రత్యేకంగా అభినందించారు. ఏడీఏ బగ్గు రజిని రామరాజును సత్కరించారు. ఒక ఎకరాకు లక్ష వరకు ఆదాయాన్ని పొందానని తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీ పి.ప్రసాద్, వ్యవసాయాధికారి దుంపల పద్మావతి, పతంజలి ఫుడ్స్ మేనేజర్ కె.రాజమోహన్, బి, శ్రీనివాసరావు, వి.రమణయ్య, ఏపీఓ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


వెంకటమ్మ (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలం బాతుపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు రాజాం వెంకటమ్మ (105) శుక్రవారం మృతి చెందా రు. వెంకటమ్మకు భర్త కామన్న, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో భర్తతో పాటు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఇప్పటికే మృతి చెందారు. వెంకటమ్మకు ముదు మనవడు రాజాం చందు అంత్యక్రియలు చేశారు.

నాలుగు రోజులుగా ఉరికి వేలాడుతూ..

- వివాహిత ఆత్మహత్య
- నాలుగు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన వైనం
- నరసన్నపేట శ్రీరామనగర్‌లో సంఘటన
- మృతురాలిది శ్రీకాకుళంలోని ప్రశాంతినగర్


మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి

నరసన్నపేట: నాలుగు రోజులుగా ఆ ఇంటి తలుపులు మూసే ఉన్నాయి. న్యూస్ పేపర్లు ఎక్కడ వేసినవి అక్కడే ఉన్నాయి. ఎవరు పిలిచినా లోపల నుంచి సమాధానం రావడం లేదు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఇంటికి వెళ్లి పరిశీలించిన పోలీసులకు ఫ్యాన్ హుక్‌కు ఓ మహిళ మృతదేహం వేలాడుతూ కనిపించింది. నాలుగు రోజులుగా ఆ మృతదేహం అలాగే ఉన్నట్లు వారు గుర్తించారు. నరసన్నపేట శ్రీరామనగర్‌లో జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతురాలు బమ్మిడి శాంతకుమారి(39) అని, ఆమెది శ్రీకాకుళంలోని ప్రశాంతినగర్ అని పోలీసులు నిర్ధారించారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

స్థానిక శ్రీరామనగర్‌లో బమ్మిడి జయకుమార్, భార్య శాంతకుమారి నివాసం ఉంటున్నారు. నాలుగు రోజులుగా ఆ ఇంటికి ఎవరూ రాకపోవడం, ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వై.సింహాచలం శుక్రవారం ఉదయం ఇంటిని పరిశీలించారు. తలుపులకు లోపల నుంచి గడియ పెట్టి ఉండడంతో తీయడం సాధ్యం కాలేదు. దీంతో ఆ కుటుంబం వివరాలు సేకరించారు. స్థానిక వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బమ్మిడి జయకుమార్ తన భార్య శాంత కుమారితో అక్కడ నివశిస్తున్నట్లు తెలుసుకున్నారు. జయకుమార్ ఆచూకీ తెలుసుకొని ఆయనను ఇంటికి రప్పించారు. అలాగే శాంతకుమారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారు వచ్చిన తర్వాత గడియ విరగ్గొట్టి లోపలకు వెళ్లి చూస్తే వంట గదిలో ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని శాంతకుమారి కనిపించింది. సంఘటన జరిగి నాలుగు రోజులు కావడంతో మృతదేహం నుంచి దుర్వాసన అధికంగా వచ్చింది. ఆమె మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. అప్పటికే సిద్ధంగా ఉన్న క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. శాంత కుమారి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

ఈ నెల 23వ తేదీ వేకువజామున ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. అంతకు ముందు రోజు భార్యతో గొడవపడిన జయకుమార్ తన స్వగ్రామం నందిగాం మండలం శ్రీపురం వెళ్లిపోయి అక్కడే ఉన్నారు. దీంతో ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. సంఘటన స్థలాన్ని టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, తహసీల్దార్ ఎ.సింహాచలంలు పరిశీలించారు. మృతురాలి తండ్రి చిగులపల్లి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట సీఐ డి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వేధింపులు తాళలేకే..'


శాంతకుమారి (ఫైల్)

'నా కుమార్తె శాంతకుమారి అల్లుడు, ఆయన కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడింది' అని తల్లిదండ్రులు చిగులపల్లి లక్ష్మణరావు, కనకరత్నం సోదరి ధనలక్ష్మిలు ఆరోపించారు. వివాహమైనప్పటి నుంచి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని తెలిపారు. అవి భరించలేకే తమ కుమార్తె చనిపోయిందని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 2018లో వివాహమైందని, సంతానం లేదని అన్నారు. భర్త జయకుమార్ మాట్లాడుతూ ఆమె తనను వేధించేదని, పలుమార్లు కొట్టిందని, ఆ బాధలకు భయపడి 22న సొంతూరు వెళ్లిపోయానని, ఆ తర్వాత ఈ అఘాయిత్యానికి పాల్పడిందని అన్నారు.

క్లుప్తంగా

రెండు నెలల్లో ఇళ్లు పూర్తి చేయాలి

● అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మంజూరు చేసిన ఇళ్లలో వచ్చే రెండు నెలల్లోగా 6,086 గృహాలను పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సామూహిక గృహ ప్రవేశానికి సంబంధించి ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని జూన్, జూలై నెలల్లో పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో సామూహిక గృహప్రవేశం లక్ష్యంగా 30 వేల ఇళ్లను నిర్దేశించగా ఇప్పటికే పూర్తి చేశామన్నారు. గృహ నిర్మాణంపై కలెక్టర్ శుక్రవారం మండలస్థాయి, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి వారంలో 750 నుంచి 800 ఇళ్లు పూర్తి చేయాలని చెప్పారు. సచివాలయం వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ పీడీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్ డే



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

విజయనగరం క్రైమ్: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఎస్పీ ఎం.దీపిక దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లాలో పనిచేస్తున్న కానిస్టేబుల్స్, అధికారులు పాల్గొన్నారు.

పే అండ్ అకౌంట్స్ కార్యాలయం పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న మల్లేశ్వర రావు

విజయనగరం ఫోర్ట్: పే అండ్ అకౌంట్స్ కార్యాలయాన్ని డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ సీహెచ్‌కే మల్లేశ్వర రావు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా బిల్లుల చెల్లింపు, ఇతర అంశాలను తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. క్రమశిక్షణ, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఎం.రామసుబ్బయ్య, జేపీపీఓ పి. బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సతీష్‌కుమార్

గరుగుబిల్లి: బలిజీపేట మండలంలోని బర్లి గ్రామానికి చెందిన బి.సతీష్ కుమార్ బాత్ రూమ్ కడిగే ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. సతీష్‌కుమార్ అక్క వావిలపల్లి నాగమణిని 14ఏళ్ల క్రితం భర్త సూర్యనారాయణ వదలి వెళ్లిపోయాడు. ఆరు నెలల క్రితం ఆయన వేరే వివాహం చేసుకుని గ్రామానికి వచ్చాడు. దీనిపై బావను నిలదీసిన సతీష్‌కుమార్‌కు అక్క మద్దతు తెలియజేయకుండా భర్తను వెనుకేసుకు రావడంతో తమ్ముడు మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో బాత్‌రూంశుభ్రం చేసే ద్రావణాన్ని తాగేశాడు. విషయం గమనించి కుటుంబ సభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నందివానివలసలో ఏనుగులు ప్రత్యక్షం



నందివానివలసలో ప్రత్యక్షమైన ఏనుగులు

గరుగుబిల్లి: గత నెలరోజుల నుంచి కొమరాడ, జియ్యమ్మవలస మండల పరిధిలో సంచరిస్తున్న ఏనుగులు శుక్రవారం సాయంత్రం గరుగుబిల్లి మండలంలోని గిజబ, నందివానివలస గ్రామ పొలిమేరలో ప్రత్యక్షమయ్యాయి. దీంతో స్థానిక రైతులు భయాందోళన చెందుతున్నారు. పంటలను నాశనం చేయకముందే ఏనుగులను అటవీప్రాంతంలోకి మళ్లించేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సాహితీ వేత్తలకు వందనం

● వందమంది కవులకు సత్కారం
● 28న రారవే సాహితీ సంబరం



రాజాం రచయితలవేదిక సింబల్



రారవే పుస్తకావిష్కరణలో మండలి బుద్ధప్రసాద్



గుంటూరులో రారవే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ విద్యాశాఖ మాజీ కమిషనర్ వాడరేవు చినభద్రుడు



రారవే నిర్వాహకులను సన్మానిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ కూన రామ్‌జీ(ఫైల్)

రాజాం: ఒక అక్షరం అనంత విశ్వానికి వెలుగు. ఒక ప్రయత్నం కోట్ల ఫలితాలకు తొలిమెట్టు. అలానే చిన్నపాటి ఆలోచన..శత సాహితీ మాసోత్సవాల కార్యక్రమానికి వారధిగా నిలిచింది. ఎంతో మంది సీనియర్ సాహితీవేత్తలతో ప్రముఖల రచనలపై విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రతినెలా సాహితీ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించింది. పదుల సంఖ్యలో కొత్త యువ రచయితలు, సాహితీవేత్తలను సమాజానికి పరిచయం చేసింది. నిర్విరామంగా ఎనిమిదేళ్ల పాటు ప్రతినెలా సాహితీ కార్యక్రమాలతో ముందుకు నడిచిన రాజాం రచయితల వేదిక(రారవే) ఈనెల 28 న వందవ మాసోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ మేరకు నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంతింతై..వటుడింతై అన్నట్లు

జనవరి 25, 2015లో ఏర్పడిన రాజాం రచయితల వేదిక అప్పట్లో రాజాం పట్టణానికి చెందిన హైస్కూల్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గార రంగనాథం ఆలోచనతో ప్రారంభమైంది. రాజాంలో విద్యానికేతన్ వేదికగా పది మంది సాహితీవేత్తలు, రచయితలతో ప్రారంభమైన ఈ వేదిక అనతికాలంలోనే రాజాంతో పాటు విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన ప్రముఖ సాహితీవేత్తల దృష్టిని ఆకర్షించింది. ప్రతి నెలా చివరి ఆదివారం రచయితలు, సాహితీవేత్తలు, కొత్తగా సమాజంలో అడుగుపెడుతున్న కవులతో సమావేశం జరుగుతుంది. ఒక అంశాన్ని, రచనను, గ్రంథాన్ని, పుస్తకాన్ని ఇలా ఏదో ఒక సాహితీ అంశంపై ఆ సమావేశంలో ప్రధాన వక్త పరిచయ కార్యక్రమం చేస్తే మిగిలిన సాహితీ వేత్తలు, రచయితల ఆ అంశంపై వారి అభిప్రాయాలను విమర్శ, ప్రతి విమర్శ రూపంలో వెల్లడిస్తారు. లోపాలపై ప్రస్తావిస్తారు. గొప్పతనాన్ని ప్రశంసిస్తారు. సమాజానికి అందులోని ముఖ్య సందేశాన్ని వివరిస్తారు. రోజంతా సాహితీ వనంలో వందలాదిమంది తేలియాడతారు. కోవిడ్ సమయంలో కూడా ఈ సాహితీ కార్యకలాపాలు ఆన్‌లైన్ ద్వారా జరిగాయి. ఇలా ప్రతి నెలా కార్యక్రమాన్ని దిగ్విజయంగా నడిపిన రారవే ఈనెల 28 న వందవ సాహితీ సమ్మేళనాన్ని శతసాహితీ సమావేశ సంబరం పేరుతో నిర్వహిస్తోంది.



రారవే సాహితీ సమావేశంలో విశాఖ బీవీకే కళాశాల రిటైర్డ్ తెలుగు ఆచార్యులు దామెర వెంకటసూర్యా రావు

సాహితీవేత్తల సమ్మేళనం

రాజాం రచయితల వేదిక సాహితీ సమ్మేళనంలో ఎంతోమంది సాహితీవేత్తలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొన్నారు. మాజీ ఉపశాసన సభాపతి మండలి బుద్ధప్రసాద్, దీర్ఘాశి విజయభాస్కర్, గుంటూరు లక్ష్మీనరసయ్య, తుర్లపాటి రాజేశ్వరి, దామెర వెంకటసూర్యారావు, అట్టాడ అప్పలనాయుడు, గంట్యాడ గౌరునాయుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు నారంశెట్టి ఉమామహేశ్వర రావు, బాల సుధాకర్ మౌళి, మేడూరి సూర్యసత్యనారాయణ, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు, పద్మశ్రీ యడ్ల గోపాలరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలు, రచనలు పరిచయంచేశారు. పండితుడు, కవి, రచయిత, విమర్శకుడైన గార రంగనాథం నిర్వహిస్తున్న రారవే ప్రశంసలు అందుకుంటోంది.

సాహిత్యంపై అభిరుచితో...



తెలుగు భాష చాలా గొప్పది. ఉత్తరాంధ్రలో చాలా మంది కవులు, రచయితలు, సాహితీవేత్తలు ఉన్నారు. వారిని సమాజానికి పరిచయం చేయాలన్నదే నా సంకల్పం. అందులో భాగంగానే ప్రతి నెలా రారవే నిర్వహిస్తున్నాం. ఎంతో మంది సాహితీవేత్తలు, రాజాం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వక్తలు, రచయితలు సహకరిస్తున్నారు. తెలుగు పండిట్‌గా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసిన నాకు తెలుగు సాహిత్యంపై అభిరుచి ఎక్కువ. రాజాంలో స్థిర నివాసిగా ఉండడంతో పాటు హెచ్‌ఎంగా పదవీ విరమణ అనంతరం రారవే స్థాపించి సాహితీసేవలను సమాజానికి అందిస్తున్నాం.

గార రంగనాథం, రారవే నిర్వాహకులు, రాజాం

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



దేవరాపల్లి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న ఎస్సై రాజేష్



గుర్ల: సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై హరిబాబు నాయుడు

వేపాడ: మండలంలోని దేవరాపల్లి నుంచి వేపాడ వస్తున్న ఇసుక ట్రాక్టర్‌కు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో పట్టుకుని సీజ్‌చేసినట్లు వల్లంపూడి ఎస్సై రాజేష్ శుక్రవారం తెలిపారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి నుంచి వేపాడ వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గురువారం రాత్రి పట్టుకుని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గరికివలసలో మరో రెండు ట్రాక్టర్లు..

గుర్ల: మండలంలోని గరికివలసలో గల చంపావతి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై హరిబాబునాయుడు శుక్రవారం పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇసుకను గ్రామ శివారులో నిల్వ చేశారని సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుకెళ్లడంతో బోసిగా మిగిలిన విద్యుత్ స్తంభాలు

వీరఘట్టం: మండలంలోని మహదేవివలస గ్రామ పంట పొలాల్లో ఉన్న 16 కేవీ సామర్థ్యం గల త్రీ-ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి దొంగిలించారు. గ్రామానికి చెందిన సభినాన వెంకటనాయుడు పొలంలో ఉన్న ఈ ట్రాన్స్ ఫార్మర్ ద్వారా పంట పొలాల్లో ఉన్న మోటార్లకు సాగునీరు అందిస్తున్నారు. సుమారు రూ.1.50 లక్షల విలువ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎవరో విద్యుత్ పనులు తెలిసిన వ్యక్తులే ఎత్తుకెళ్లి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. సంబంధిత రైతు ఇచ్చిన సమాచారం మేరకు ఏఈ డి.బాలాజీ శుక్రవారం వీరఘట్టం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నెల రోజుల క్రితం కూడా చిట్టపులివలస జంక్షన్ వద్ద ఉన్న 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే విలువైన రాగిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. నెల రోజుల వ్యవధిలోనే విద్యుత్ సరఫరా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కరెంట్ కట్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించారంటే ఇది విద్యుత్ పనులు తెలిసిన ముఠా పనేనని పోలీసులు అనుమానంవ్యక్తం చేస్తున్నారు.

29న జగనన్నకు చెబుదాం

పార్వతీపురం: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రతి సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ఈనెల 29న కలెక్టరేట్ దిగువ సెల్లార్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఆర్‌ఓ జె.వెంకట్రావు శుక్రవారం తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే జిల్లా అధికారులు, అర్జీదారులు ఈ విషయం గమనించాలని కోరారు.

మాతా, శిశు మరణాలను అరికట్టాలి

● కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం జరిగే వరకు నిత్యం పర్యవేక్షించాలని తద్వారా మాతా, శిశు మరణాలను అరికట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. అవసరమైన పరీక్షలు చేయడం, మందులు వాడవలసి ఉంటే వారి కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయాలని సూచించారు. తల్లీబిడ్డలు సురక్షితంగా ఉండేలా వైద్యాధికారులు, ఆశ, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా భావించాలని చెప్పారు. తన చాంబర్‌లో శుక్రవారం మాతా, శిశు మరణాలపై కేసుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఏప్రిల్, మే నెలలో రెండు మాతృ మరణాలు, 6 శిశు మరణాలు సంభవించాయని డీఎంహెచ్‌ఓ రమణకుమారి వివరించారు. ఏఒక్క గర్భిణి, శిశువు వైద్యం అందని కారణంగా మరణించరాదన్నారు. ఘోషాఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు రిఫర్ చేసిన కేసులపై ఆరా తీశారు. ఇక్కడ లేనిది కేజీహెచ్‌లో ఉండేది ఏమిటని ఘోషాఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ అరుణకుమారిని ప్రశ్నించారు. చిన్న పిల్లల కోసం వెంటిలేటర్ ఇక్కడ లేనందున అక్కడికి రిఫర్ చేశామని ఆమె తెలిపారు. హైరిస్క్ ఉన్న వారి పట్ల ప్రత్యేక దృష్టి సారించి, వారి కుటుంబ సభ్యులను అప్రమత్తంగా చేయాలని సూచించారు. ప్రతి మరణం నుంచి ఎంతో కొంత నేరుకోవాలని, అప్పుడే తదుపరి కేసులో ఎలాంటి తప్పిదం జరగకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చుక్క శ్రీకాంత్, ఐసీడీఎస్ పీడీ శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

గుండె పోటుతో వలంటీర్ మృతి



వలంటీర్ రాపాక సత్యం(ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని దాసుపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో వలంటీర్ రాపాక సత్యం(27)మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పక్క గ్రామమైన లింగాలవలసలో యువకులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా సత్యం ఒక్కసారిగా కిందపడి అపస్మారక స్థితికి చేరుకోవడంతో వెంటనే సమీపంలో ఉన్న గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఒకగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు.

ఎండ బారిన పడి వృద్ధుడు..



ఎండతీవ్రతతో మృతి చెందిన జగ్గారావు

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామ పంచాయతీ పరిధి అయ్యన్న అగ్రహారం గ్రామానికి సమీపంలో ఎండ తీవ్రతతో పాటు బీపీ, సుగర్ కారణంగా ఓ వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం నందాం గ్రామానికి చెందిన రొంగలి జగ్గారావు(62) జాతరలు జరిగే ప్రాంతాలకు వెళ్లి బూరలతో పాటు ఇతర ఆట వస్తువులను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అంబటివలస గ్రామంలో జరుగుతున్న పండగకు వచ్చి ఆటవస్తువులు విక్రయించుకుని ఇంటికి అడ్డదారిలో వెళ్తున్న క్రమంలో మృత్యువాత పడ్డాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల చించివేత



సీఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీసీ టీవీ ఫుటేజ్‌లో కనిపిస్తున్న ఫ్లెక్సీలు చించివేస్తున్న దుండగుల చిత్రాలు

సాలూరు: పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధం అనే పేరుతో పట్టణంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన వైఎస్సార్‌సీపీకి చెందిన భారీ ఫ్లెక్సీలను పలువురు దుండగులు గురువారం రాత్రి చించివేశారు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు జర్జాపు సూరిబాబు, గిరిరఘు తదితరుల ఆధ్వర్యంలో పట్టణ సీఐ శ్రీనివాస రావును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

రెండు బైక్‌లు ఢీ: డిప్యూటీ తహసీల్దార్‌కు గాయాలు



పార్వతీపురం: చికిత్సపొందుతున్న క్షతగాత్రులు



సీతానగరం: అచ్యుతరావుకు చికిత్స చేస్తున్న డాక్టర్ ఉషారాణి

బొండపల్లి: విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రౌతు శంకర్రావును మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో శుక్రవారం ఆయన తీవ్ర గాయాల పాలయ్యారు. గాయ పడిన డీటీని విజయనగరం ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

ఆటో బోల్తాపడి మరో ఇద్దరికి..

పార్వతీపురం/కొమరాడ: కొమరాడ మండలం చోళ్లపథం పంచాయతీ రెబ్బ గ్రామానికి చెందిన వి.సీతారాంతో పాటు పలువురు వ్యక్తిగత పనుల నిమిత్తం చినమేరంగి శుక్రవారం ఆటోలో వెళ్లారు. చినమేరంగి నుంచి తిరుగు ప్రయాణంలో మాదలింగి, తొడుము గ్రామం మధ్యలో మలుపువద్ద ఆటో బోల్తాపడడంతో సీతారాంతో పాటు హిమరిక శంకరరావుకు పలుచోట్ల గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తికి..

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై చిన భోగిలి వద్ద టీవీఎస్ వాహనంపై వస్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. బూర్జ గ్రామానికి చెందిన ఎస్ అచ్యుతరావు చినభోగిలి పెట్రోల్ బంకులో తన టీవీఎస్ బండికి పెట్రోలు వేయించుకుని సీతానగరం వస్తుండగా సీతానగరం నుంచి బొబ్బిలి వెళ్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టడంతో అచ్యుతరావుకు గాయాలయ్యాయి. గాయాలపాలైన వ్యక్తిని పార్వతీపురం మన్య జిల్లా కేంద్రాసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ దీపికా పాటిల్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఎం.దీపికాపాటిల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, సీడీ ఫైల్స్, స్టేషన్ ఆవరణ, లాకప్ గదులు, ప్రాపర్టీని పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బంది ప్రవర్తన, స్టేషన్‌కు వచ్చిన వారితో ఎలా ఉండాలనే విషయమై పలు సూచనలు చేశారు. రాత్రి సమయాలలో గస్తీ పెంచాలని, గ్రామ సందర్శన ముమ్మరం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్, సీఐ ఎల్.అప్పలనాయుడు, పెదమానాపురం ఎస్సై శిరీష పాల్గొన్నారు.

ఖాతాదారులందరూ పాలకవర్గ సభ్యులే

● ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరావు

విజయనగరం ఫోర్ట్: బ్యాంకులో ఉన్న ఖాతాదారులందరూ పాలకవర్గ సభ్యులేనని ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పేర్కొన్నారు. పూల్‌బాగ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బ్యాంక్ మహాజన సభలో ఆయన మాట్లాడుతూ రూ.42.81 కోట్ల రుణాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ వ్యాపార సంస్థలా కాకుండా ప్రజల సంస్థగా భావించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గుడివాడ భాస్కర రావు, బ్రాంచ్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రసాదరావు, డైరెక్టర్లు భవాని, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

దత్తిరాజేరు: మండలంలోని చినకాద ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామానికి చెందిన గేదెల అప్పలనాయుడు మరి కొంత మంది జిల్లా గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేయడంతో ఏపీడీ జనార్దన్, ఏపీఓ సత్యవతి శుక్రవారం విచారణ చేశారు. ఈ మేరకు గ్రామ సచివాలయంలో ఫిర్యాదుదారులు, క్షేత్ర సహాయకురాలు, గ్రామ పెద్దల సమక్షంలో విచారణ చేసిన సందర్భంగా గ్రామంలో లేని వారికి మస్టర్లు వేశారని, అలాగే వేతన దారుల వద్ద నగదు వసూలు చేశారన్న ఫిర్యాదుపై వేతన దారులను విచారణచేయగా నగదు వసూలు చేయలేదని అధికారుల ముందు చెప్పారు. ఆమె తల్లిదండ్రులు పనికిరాకుండా క్షేత్ర సహాయకురాలు మస్టర్లు వేసినట్లు కొంతమంది వేతనదారులు ఆరోపించారు. తనపై కక్ష సాధిపు కోసం కొంత మంది తప్పుడు ఫిర్యాదు చేశారని క్షేత్ర సహాయకురాలు రామలక్ష్మి విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. విచారణలో సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏపీడీ చెప్పారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు అవకాశం

● వచ్చేనెల 15 నుంచి మండల స్థాయిలో ఎంపికలు
● 22 నుంచి జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు
● సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్

విజయనగరం: కడప జిల్లాలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ శుక్రవారం తెలిపారు. వచ్చేనెల 15 నుంచి 20వ తేదీ వరకు మండల స్థాయిలోను, 22 నుంచి 26వ తేదీ వరకు జిల్లా స్థాయిలో బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభకనబరిచిన వారిని 29, 30 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తామన్నారు. 4వ తరగతిలో ప్రవేశాలకు 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు, 5 తరగతిలో ప్రవేశాలకు 9 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని 27 మండలాలు, 4 మున్సిపాలిటీల్లో 3, 4 తరగతుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, విద్యార్థులు తమ ఆధార్‌కార్డుతో పాటు జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, నేటివిటీ, ఇన్‌కమ్ సర్టిఫికెట్‌లు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

66 రైతుబజార్లలో పైనాపిల్ విక్రయం

● డీహెచ్‌ఓ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ సత్యనారాయణరెడ్డి

సీతంపేట: ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని 66 రైతు బజార్లలో పైనాపిల్ విక్రయానికి అనుమతులు తీసుకున్నట్లు జిల్లా ఉద్యానవన అధికారి (డీహెచ్‌ఓ) సత్యనారాయణరెడ్డి తెలిపారు. సీతంపేట ఐటీడీఏలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఎన్జీఓలు, పైనాపిల్ రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు పైనాపిల్ రవాణా చేసే రైతులు ఈ నెల 27 నుంచి ఐటీడీఏలోని ఉద్యానవనశాఖ ద్వారా అనుమతులు తీసుకోవచ్చన్నారు. రైతు సంఘం బ్యాంక్‌పాస్‌బుక్, రైతు ఆధార్, పాస్‌ఫొటో తీసుకురావాలన్నారు. విక్రయాల్లో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. అందరూ ఒకే దగ్గర కాకుండా ఒక్కో రైతు ఒక్కో రైతు బజారుకు వెళ్లి అమ్ముకునేలా అనుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం సంధ్యారాణి, మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, వైకేపీ ఏపీడీ రమణ, హెచ్‌ఓలు ఆయంతి, అమరేశ్వరి పాల్గొన్నారు.